

ఆటగదరా శివా!!
శివతత్వాలు
తనికెళ్ల భరణి

Avadhana Saraswati Peetham

Avadhāna Sahasraphani
Brahmasri Dr. Mādugula Nāgaphani Sarma

दूरवाणी 7567726

सहस्रधारणा जीयात् अवधान सरस्वती

काव्यं तु जातु जायेत

कस्यचित् पुण्यशीलिनः मुखात् कदाऽपि उद्भवति काव्यम् । अत "आट गदरा शिवा आटगद केशवा!" इति आन्ध्रीयं गेयकाव्यं 'तनिकेळ्ळ भरणि' नाम्नः रचयितुः मुखादुद्भूतम् ।

शिवकेशवाद्वैत रूपस्थितिः यद्यपि काव्यारम्भे तथाऽपि महेश्वर पारम्यमेवात्र काव्ये प्रपञ्चितम् ।

लघुनपुस्तकमपीदं काव्यं अत्यन्तमहार्थदायि- चमत्कारि- सुन्दरं- रसानन्दबन्धुरं च राराजते ।

शिवतत्त्व(कथा)पदा दीप्तिः
गीतिः काव्याध्वनि स्थिरा
चन्द्रचूड कृपाचूडं
'भरणि' उद्भवतारकम् ॥

भरण्युद्भवतारकम् —— मङ्गलाशिषा
माडुगुल नागफणिशर्मा ।

A-707, Mathrushri Apartments, Hyderguda, Hyderabad 29. Ph: 599270, 211199.

ఆటగదరా శివా!!

శివతత్త్వాలు

తనికెళ్ళ భరణి

సౌందర్యలహరి ప్రచురణలు

తొలి 'అర్చకం' శ్రావణమాసం - ప్రమాథి 1999

ద్వితీయ ముద్రణ : 2001

మూడో ముద్రణ : చిత్రభాను, భాద్రపద మాసం - 2002

నాలుగో ముద్రణ : 2004

పూపివపూలు : పదివేలు

ముంగిట ముత్యాలముగ్గు : శ్రీ బాపు

సౌందర్యలహరి : ప్రచురణ

మూల్యం : ఆరు రూపాయలు.

ప్రతులకు :
నవ్య ప్రింటర్స్
హిమాయత్‌నగర్, హైదరాబాద్.
ఫోన్ : 23223672.

In U.S.A. and other Countries : $ 05

ఆత్మస్తుతి

జనవరి ౧౫... ౧౯౯౯ అంటే

సంక్రాంతి వెళ్ళిన మర్నాడు...

శివుడికి అభిషేకం చేసుకోడానికి వెళ్తూ దినపత్రిక చూశా... శబరిమలలో శిఖరం కూలి రెండువందల మంది భక్తుల దుర్మరణం!!

ఆ వార్త హృదయాన్ని కలిచివేసింది... గుండె పిండేసింది... కళ్ళనిండా నీళ్ళు! అప్రయత్నంగా నోట్లోంచి 'ఆటగదరా శివా!' అనివొచ్చింది!!

అక్కణ్ణించే ఇరవైరెండు రోజుల బాటు... జ్వరవొచ్చేసినట్టై పోయింది... పడుకున్నా లేచినా అదే ...

శివతత్వాల్ని రాయడం మొదలెట్టా ...

[illegible] ఆరో తేనికల్లు [illegible] తత్త్వాల అష్టోత్తరం — పూర్తయిం[illegible]
[illegible] నాలో నేను దహించగా అక్షర రూపంలో [illegible]
[illegible]ధార ప్రతీ అక్షరం ...

ప్రత్యక్షంగా .... శివుడిదే ! అంతా వాడి ఆటే !

[illegible] ఆ శివతత్త్వాల్ని .... ఆంధ్ర దేశంలో ఉన్న [illegible] క్షేత్రాల్లోనూ .... వీలైతే భారతదేశం యావత్తూ ....

[illegible]కాశం ఉంటే భూగోళం అంతా గానం చేద్దామనిపించి ... 'మహానంది' క్షేత్రంలో పాఠ్యం మొదలెట్టా ....

ఈ ఆటలో ఎంతోమంది భాగస్వాములు .... ఆటగదరా శివా[illegible] - ఆదిశ్రోత .... సహృదయ మిత్రుడు - నాగలింగంగారి పుత్రుడు [illegible] బ్రహ్మానందం.

శివతత్త్వాల్ని మధ్యమావతి రాగంలో మాలకట్టాడు వీణాపా[illegible]

దానికి ఖండగతిలో మృదంగం కొట్టాడు వర్షం వే[illegible] వెనువెంట ఉండి తంబురమీటిన తుంబురుడు చేబియ్యం శ్రీనివాసన్.

అర్ధరాత్రుళ్ళు గబుక్కునలేచి శివతత్త్వాల్ని పాడుతుంటే నా[illegible] పిచ్చెక్కిందేమో అని అనుకున్న నా అర్ధనారీశ్వరి భవానీ ([illegible] అంతకన్నా అదృష్టముందా .... పిచ్చిది కాకపోతే).

నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన పుంభావ సరస్వ[illegible] వేటూరిగారు.

అక్షరాక్షతలను చల్లిన విద్వన్మణి నాగఫణిశర్మగారు.

ఆత్మీయంగా పదాలతో పాట గట్టి మెళ్ళో వేసిన అన్న సీతారామశాస్త్రి.

కళ్ళనిండా నీళ్ళతో వాగాభిషేకం చేసిన షణ్ముఖశర్మ.

పద్యాన్ని వెలిగించి పరిమళాలందించిన జొన్నవిత్తుల. 'ఈ పంచాక్షర ప్రభువుల' పరిపూర్ణ దయ నాయందుంది. వినగానే పరవశించి ... పరమశివించి ... మృదంగాన్ని పరమేశ్వరార్పణం చేసిన ఎల్లా వెంకటేశ్వర రావుగారూ.

అచ్చు దోషాల్ని సవరించి ప్రతి పదాన్ని ... పాదాన్ని ... స్పర్శించి పులకించిన నావాళ్ళు 'ఇన్నం', సుబ్రహ్మణ్య దివాకర్! దీన్ని పుస్తకంగా తీసుకొద్దాం అన్న ఉత్తర క్షణం స్పందించి పదివేల కాపీలు నేను ఉచితంగా వేసి పెడ్తానన్న 'విద్య'... సంస్థ అధినేత ... దాత ... శ్రీ అన్నవరపు కుమార్ ...

పాడి వినిపించగానే ! కుంచె అంచున హరిహరాద్వైతాన్ని ఆవిష్కరించి అద్భుతమైన బొమ్మతో నాకు విశ్వరూప సాక్షాత్కారాన్ని ... గీత చేత ప్రసాదించిన శ్రీ బాపు ...

మహానందికి నాతో పాటొచ్చి పరవశించిన మరో నంది. సుదర్శనం ...

శివతత్త్వ ప్రచారంలో పరమభాగమైన నా కారూ ... డ్రైవర్ రమేషూ ... వీళ్ళంతా నా ఆత్మీయులు ...

వీళ్ళని నేను పొగడ్డం ఆత్మస్తుతే ...

హరిహరులు మా అందర్నీ ఆశీర్వదిస్తారు... అమ్మ తోడు ... !!!

ఆశాసనమ్

పరమేశ్వరుని ప్రళయకేళీ లీలా తాండవంలో ఒక భాగంగా - భక్తితో, భక్తులతో కిక్కిరిసిన ఒక కొండకొన, ఒక కొండ చరియ విరిగి పడినప్పుడు వందలకొలది భక్తులకు అర్ధాయుష్కపు ముక్తి లభించినప్పుడు, కలత చెంది ద్రవించిన ఒక మనఃశీతల శిఖరాగ్రం నుంచి పారిన గంగా తరంగిణి ఈ శివతత్వాలు.

ఆ హిమ శీతల శిఖరం తనికెళ్ల భరణి మనస్సు,

ఆ కొండ చరియ - శబరిమల,

ఆది కవి వాల్మీకి శోకం శ్లోకమైనట్లు, ఈ తడి వెతల ఊట ఒక తత్త్వపు పాటగా రూపు దిద్దుకుంది. ఈ బాధకు, భావానికి అధిష్ఠాన భూమి హరిహరాద్వైత మూర్తి అయ్యప్ప కావడం వల్ల

"ఆట గదరా శివా

ఆట గద కేశవా"

అన్న పల్లవి పల్లవించింది. వ్యవహార భాషా సౌష్ఠవంతో సాగిన ఈ పాట భరణి కళ్లు మూసుకొని తాను లీనమై, నాకు పాడుతూ వినిపించినప్పుడు ఒక గణపతి, ఒక షణ్ముఖుడు, ఒక కైలాసము, ఒక అభిషేకము, ఒక తెలుపు నలుపుల గెలుపు, ఒక క్షీరసాగరము, ఒక హాలాహలము, ఒక అమృతభాండము, ఒక కొండ, ఒక కోన, ఒక లోక సప్తకము, ఒక బ్రహ్మాండ మండలము నాకు కళ్లెదుట భాసించాయి.

"ఆట గద కవికి

లక్షల అక్షరాలిచ్చి

భిక్షమెత్తించేవు

కుక్షికొరకు"

అన్నచోట తన అక్షర వృత్తిని పరమేశ్వరుని భిక్షా వృత్తికి హత్తించి కొత్త సొగసులు దిద్దాడు. తనికెళ్ల భరణి గారి అఖండమైన ఈ పాట ఖండ గతిలో ధీరంగా మధ్యమావతిలో మంద్ర గంభీరంగా నాలుగు, నాలుగు పాదాలతో ఆగే విశ్రాంతి ధామంతో ముక్తక ప్రాయంగా సాగింది. నూట ఎనిమిది ముక్తకాలలో ఉన్న ఈ అఖండ గీతిలో మొదటి నూరు పరమేశ్వరుని బహిరర్చనం అయితే చివరి ఎనిమిది ఆత్మార్చనం. అందుకే అంత దాకా శివా, కేశవా అంటున్నవాడు ఆ ఎనిమిదింటిలో ఆత్మలింగేశ్వరా! అన్న సంబోధనాన్ని అందుకున్నాడు.

అస్థిమాల కంఠాన వేయడంతో, తన శిరమును నారికేళం చేయడంతో, ఊపిరులు అగరు ధూపములుగా, నేత్రములు నేతి దీపాలుగా వెలిగించడంతో, ఆరు చక్రాలను పుష్పాలుగా,

కుండలినీ శక్తిని యజ్ఞోపవీతముగా సమర్పించి పరాకాష్ఠకు చేరిన ఆయన ఆత్మార్పన "బూడిదై నేను నీభూది పూతు" అనడంతో ఆత్మార్పణగా పరిణమించి శివజటాజూటాంతర్గత కవితా గంగా తరంగణి. అష్టతను మూర్తియైన ఆది దేవునితో అద్వైతస్థితి సాధించింది.

తత్ తథాస్తు

జయోస్తు

కన - మృత్యుంజయ లీల పాట యనగా కైమోడ్పు సయ్యాటగా
అనుభూతిన్ కృతి భూతిగా మలచి - అయ్యద్వైతమూర్తిన్
త్రిలోచను - శ్రీలోచను గొల్చినావు - కవితా సౌందర్య ధారాధునిన్
తనికెళ్లాన్వయ వార్ధి చంద్ర! భరణీ! ధన్యార్థ కావ్యధ్వనీ!

అనేక మంగళాశాసనములతో

మాడుగుల నాగఫణి శర్మ

13.8.99

అన్నమాట

పల్లవి

శ్రీవాణి నిన్నెంత కరుణించెరా ! శివకావ్య గానమౌ స్వరమిచ్చెరా !
శ్రీరాణి నీకెంత కలిమిచ్చెరా ! శివ చింతనాసక్తి కలిగించెరా !
శర్వాణి. దీవించి. వరమిచ్చెరా! శివతత్త్వ రసవృష్టి కురిపించెరా
నినుగన్న, కడుపెంత పులకించెరా ! శివభావనగ నిను కనిపించెరా !

॥ శ్రీవాణి ॥

చరణం - 1

నీ జిహ్వ ఏ తపము సాధించెరా ! శివదివ్య చరితామృతమ్మందెరా !
నీ గళముకే బలము ప్రాప్తించెరా ! గరళ కంఠుని పిలువ ఎలుగెత్తెరా !

ఏ పూర్వ పుణ్యమ్ము సిద్ధించెరా ! శివమూర్తిపై దృష్టి బరపించెరా !
నీ బ్రతుకు సద్యమ్ము ఫలియించెరా ! శివకీర్తనా సస్యమందించెరా !
ఏ జన్మదీయోగసంచితమురా ! ఈ పసిడి పాత్రమ్ముగా వెలసెరా !

చరణం - 2

మాటలిచ్చిన తల్లి ఐన్నాళ్లకి ఎఱుక కలిగించింది నీ మాటకి
నడకలొచ్చిన పదముకీ నాటికి, వెలుగు కనిపించింది తన బాటకి
పలుక నేర్చిన కళకు ఈనాటికి, విలువేదొ తెలిసింది తన విద్యకి
వాక్కులొచ్చిన వాయికీ నాటికి, అర్థమ్ము తెలిసింది శబ్దానికి
చదువు పొందిన తెలివి ఈ నాటికి, పదవి సంపాదించె శివభక్తికి

॥ శ్రీవాణి ॥

చరణం - 3

నాద నాథుని చేతిడమరుకమ్మున చెలగు, అక్షరాకృతి దాల్చె ఈ నాటికి
అచ్ఛమై, స్వచ్ఛమై, అర్హతను సాధించె, అక్షరాభ్యాసమ్ము, పరిపూర్తికి
ఆదినటరాజు పాదాల అందియలుగా, పదములను పాడిగేటి ఈ నాటికి
వాగర్థముల అర్ధనారీశుదర్శించు, అర్థ వాక్ప్రతిపత్తి కలిగె నీ యార్తికి

॥ శ్రీవాణి ॥

చరణం - 4

ఆ చిదంబర స్వామి చిద్విలాసపు ఆట
తనలయులలో, తాళగతులలో, జతులలో
నిలిపి యుంచే వరకు నీ కవనతేళ

ఆటవెలదిగ ఆడి అలసిపోదన్న మాట
తేటగీతిగ గాలి కలిసిపోదన్నమాట
శ్రీ భారతిమాత ఆశీస్సు సాధించుకున్నమాట
చిరకీర్తి సాధించి తరియించుమన్నమాట
అన్న, దిగ్విజయోస్తు అన్నదీ అన్నమాట !

సిరివెన్నెల సీతారామశాస్త్రి

ఇది విశ్వరూప సాక్షాత్కారం

'క్రీడార్థం సృజసి ప్రపంచ మఖిలం ....'

అని ఆదిశంకరులు శంకరునితో ముచ్చటించారు. ఈ జగత్తంతా క్రీడా వినోద శివానంద లహరిగా ప్రత్యక్షీకరించారు.

"ఓ స్వామీ! నీ ఆట కోసం ప్రపంచాన్ని సృష్టించావు. నేనూ నీ ఆటలో పరికరాన్నే, నీకు వినోదం కలిగించడానికి సాధనాన్నైనందుకు ధన్యుడ్ని ....' అంటారా జగద్గురువులు.

ఆ ఆటల వినోదం ఈ పాట(ల)లో సాక్షాత్కరించింది.

ఇది మామూలు మాటల్లో కనిపిస్తూ మోసం చేసే సయ్యాట. ఎంతో లోతుని దాచుకుని లేతగా కనిపించడం ఈ పాట ఆడే ఆట.

'భరణి' అనే ఈ వ్యక్తిలోని జీవుడు ఎన్ని జన్మల తపస్సుని ప్రోది చేసుకొని శివుని ప్రత్యక్షం చేసుకున్నాడో!

సృష్టిలో 'సీరియస్' ఏదీ లేదు. ప్రతిదీ ఆటే.

ఆట అని గుర్తించనంతవరకు ఆవేదన తప్పదు.

'అంతా అతని ఆట' - అన్నది స్పష్టంగా మన అనుభూతిలోకి వస్తే - 'సర్వం శివమయం జగత్' అనే దర్శనమే సిద్ధిస్తుంది. అంతకన్నా కైవల్యం వేరొకటి లేదు.

ఇందులో ఉపనిషత్తుల హృదయ స్పందన కూడా ధ్వనిస్తుంది. అయితే అవన్నీ చదివి, అధ్యయనం చేసి రాసిన పాట కాదది. స్వచ్ఛమైన మనస్సు సదాశివుని పదాల దగ్గరచేరి, ఆ స్పర్శకు స్పందించి చేసిన 'దర్శనం' ఇది.

తపించే హృదయంలో తత్వం తనను తానే ఆవిష్కరించుకుంటుంది. ఆ సహజావిష్కరణే ఈ గేయధార.

జీవితాన్ని పలకరించి, స్పృశించే ప్రతి అంశాన్నీ, ప్రతి అనుభూతినీ పరమేశ్వర లీలావిలాసంగా దర్శించడం ఒక యోగం. అన్ని యోగాలకీ గమ్యమైన 'యోగం'.

'ఆర్తి'ని ఆధ్యాత్మిక సంవేదనగా మార్చుకోకపోతే ఈ అవగాహన కుదురుతుందా ! కనబడుతున్న భూమికను దాటి వేరే దివ్య భూమికలో నుండి, ప్రపంచాన్ని దర్శించడం కాకపోతే ఈ 'శివ విశ్వరూప సాక్షాత్కారం' సాధ్యమౌతుందా ?

కాలయవనిక మీద కదులుతున్న భూత భవిష్యద్వర్తమానాలు, ఆ బ్రహ్మ కీటపర్యంతం ఉన్న సౌందర్యాలూ, వైకృత్యాలూ, సుఖాలూ, దుఃఖాలు, స్వార్థాలూ, త్యాగాలూ, మానవత్వమూ రాక్షసత్వమూ, సత్యమూ, అసత్యమూ, పరీక్షలూ కటాక్షాలూ ... ఈ ద్వంద్వాలన్నీ ఒకే ప్రపంచపు పలు ముఖాలుగా గమనించడం, వీటన్నిటినీ నడిపేవానిని, వీటి వేటికీ అంటనివిశ్వేశ్వరునిగా గ్రహించడం ... ఈ గీతికా రచనగా సాగిన సాధన, సిద్ధి.

ఈ రచన చదువుతున్నంత సేపు మనస్సు విశ్వవిశ్వాంతరాళాలు చుట్టి వస్తుంది — వేటికి వాటిని వేరు చేయకుండా అన్నిటిలో ఏక సూత్రంగా ఉండే ఈశ్వరహేలని పరిశీలిస్తుంది. అంతలోనే తనలోతనను అవలోకనం చేసుకుంటుంది... అంతర్ముఖ యానం సాగిస్తుంది.

అంతలోనే కంటి చెమరింత. ఆ చెమరింతలో అభిషిక్తుడయ్యే శివుని దర్శనం.

ఈ రచనలో కవితా చమత్కృతులూ పుష్కలమే. వెంటనే సాహితీ పరిభాషలు ప్రయోగించి దీని విలువలు తూచడానికి ప్రయత్నించబోతే, అది అపరాధమౌతుందేమో !

వీటిని ఆ సాహిత్యపు విలువులతో తూచ ప్రయత్నిస్తే, ప్రాణభూతమైన 'తాత్త్వికత'ని గమనించని ప్రమాదం ఉంది. తద్వారా ప్రయోజనాన్ని కోల్పోయే అవకాశం ఉంది.

పసితనపు లాలిత్యంలో మూటకట్టిన పరిణత ప్రజ్ఞ, పరమార్థ భావన .. ఈ పాట.

అంతా పరమశివుని ఆటగా గమనిస్తే, మనమూ ఆయనతో తిరిగి ఆడుకోవచ్చు. అలా తిరిగి ఆడుకొనేవాడే భక్తుడు, తాత్త్వికుడు, జ్ఞాని, యోగి. ఆ 'తిరిగి ఆడుకున్న' ఈ పాటలాటలో పరవళ్ళు తొక్కడం ఎంత ధన్యత !

ఆదిదేవుని ఆటలను చూస్తూ చూస్తూ వుంటే, ఆ ఆత్మలింగేశ్వరునకు ఆత్మ నివేదన అతి సహజంగా జరుగుతుంది. అది ఈ పాటలోని ఉపసంహారచరణాలలో పల్లవిస్తుంది.

ఆటకి కూడా ముగింపు కావాలి. "ఆట కదరా నీకు ఒక్కటే ఒక్కటని ఒక్కటయ్యే వరకు ఆటనీకు..." ఈ అద్వైత సిద్ధిని ప్రస్తావించడంతో, ఈ చిన్న కవిత మహాకావ్యమంత బరువయ్యింది.

ఇంత చక్కని తాత్త్విక రచనలో "ఆట కదరా నీకు, షణ్ముఖుని శివపదం, ఆట కదా నీ కతని ఆర్తిరచన —" అని నేనూ నా రచనా శివలీలగా గుర్తింపబడడం సౌభాగ్యంగా భావిస్తున్నాను.

ఇటువంటి రచన చేసిన సహృదయ మిత్రులు శ్రీ తనికెళ్ళ భరణి గారి మనసులో, రచనలో చోటు చేసుకోవడం నా అదృష్టం !

ఈ అనవరత శివార్చనలో శ్రీ భరణి గారు కృతార్థులు కావాలని ఆ సదాశివుని ప్రార్థిస్తూ —

సామవేదం షణ్ముఖ శర్మ
చెన్నై
19-7-1999

శివాద్భుతం

సీ॥ భరణి బ్రహ్మాండమ్ము, భావమ్ము, శబ్దమ్ము,
అదియు బ్రహ్మాండమ్ము, అమృత కవిత !
శ్రవణ మాత్రమ్మున శివతత్వ మహిమను
తెలివికి చేకూర్చు దివ్య కవిత !
సృష్టి స్థితిలయల చిద్రూప చిత్రాలు
హృదయాన ముద్రించు హృద్య కవిత!
గుండె లోలోతులో నుండి ఉప్పొంగిన
సరసమౌ సరళమౌ సత్య కవిత !

తే॥ గీ॥ మదిని శివునకు ముడిపెట్టు మధుర కవిత !
భవుని ఆటను చూచిన భరణి కవిత!
పరమ రమణీయ శివపాద భక్తి కవిత !
నిత్యమును సాగు ఆటగా నిలుచు కవిత !

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు
౩.౮.౨౨

ఆటగదరా శివా!

ఆటగద కేశవా !!

ఆటగదరా !

నీకు అమ్మతోడు !!

ఆటగద గణపతిని
తిరిగి బతికించేవు
కళ్ళుమూయుట
మొదటి ఆట నీకు.

ఆటగద మాయకే
మాంగల్యమును గట్టి
కామదహనమ్ము
సయ్యాట నీకు

ఆటబ్రహ్మకు సృష్టి
అంతమే నీ దృష్టి
విష్ణుమాయలు గూడ
ఆట నీకు.

ఆటచదువుల తల్లి
ఆట బంగరువల్లి
ఆట గద
శ్రీ చక్ర సంచారిణీ.

ఆటగద మార్కండునకు
ఆయువొసగేవు
మృత్యుంజయత్వమ్ము
ఆటనీకు.

ఆటగద భక్త శిరియాళునే
భుక్తిగొని
ముక్తి ప్రసాదించు
టాట నీకు.

ఆటగదరా నీకు
ఆదిశంకర బోధ
ఆటగద
అద్వైత సిద్ధాంతము.

ఆటగదరా నీకు
చతురంగ ఖేలనం
జీవులే పావులై
ఆటనీకు.

ఆటగదరా నీకు
ధూర్జటి కవి పలుకు
ఆట గద
శ్రీకాళహస్తి మహిమ.

ఆటగదరా నీకు
కాళిదాసుని కవిత
సుకుమార సంభవం
బాట నీకు

ఆటగదరా నీకు
శ్రీనాథు వైభవం
ఆట గదరా నీకు
హరవిలాసం

ఆటగదరా నీకు
షణ్ముఖుని శివపదం
ఆట గద నీకతని
ఆర్తిరచన.

ఆటగదరా నీకు
సాలీడు బూడిదై
ఆట గద
శ్రీకాళహస్తి నీకు.

ఆటగదరా నీకు
పడగ పగిలిన పాము
ఆట గద
శ్రీ కాళహస్తి నీకు.

ఆటగదరా నీకు
హతమైన గజరాజు
ఆట గద
శ్రీకాళహస్తి నీకు.

ఆటగదరా నీకు
అడవిలో లింగమా!
ఆటగదరా నీకు
కోయకన్ను

ఆటగదరా నీకు
కీటకమ్ములు గూడ
పక్షులకు
ఆహారమైనయపుడు

ఆటగదరా నీకు
పక్షి అండాలకై
సర్పాలు వృక్షాల
బాకువేళ

ఆటగదరా నీకు
పాముపడగల పైన
గురిచూసి
విసిరేటి గద్దగోరు.

ఆటగదరా నీకు
ఆయువుడిగిన పక్షి
మేనిపై వేలాది
కీటకాలు.

ఆటగదరా నీకు
అమృతాభిషేకమ్ము
ఆటగదరా నీకు
బూదిపూత.

ఆటగదరా నీకు
పాషాణమున జలము
ఆట గద
జలధిలో అగ్నికీల.

ఆటగదరా శివా
ఆటగద కేశవా
రెండు రూపాలైన
ఒకటె నీవు.

ఆటగదరా నీకు
అన్నపూర్ణ ప్రియా
ఆకలికి భిక్షాట
నాట నీకు.

ఆటగద జననాలు
ఆటగద మరణాలు
మధ్యలో ప్రణయాలు
ఆట నీకు.

ఆటగద సొంతాలు
ఆటగద పంతాలు
ఆటగద అంతాలు
ఆట నీకు.

ఆటగదరా నలుపు
ఆటగదరా తెలుపు
నలుపు తెలుపుల
గెలుపు ఆట నీకు.

ఆటగదరా మన్ను
ఆటగదరా మిన్ను
మిధ్యలో ఉంచి
ఆడేవు నన్ను.

ఆటగదరా నీకు
అర్చించు భక్తులను
అష్టకష్టాల
పాల్జేతువీవు.

ఆటగదరా నీకు
వేధించు దుష్టులకు
వరమిచ్చి మురిసేవు
ఆట నీకు.

ఆటగదరా నీకు
వరదహస్తము నుండి
కనకంబు కన్నీరు
కలసి జారు.

ఆటగదరా నీకు
అభయ హస్తములోన
ఆత్మ ఆనంద
లోకాలదేలు.

ఆటగదరా నీకు
నెత్తిపై నెలవంక
ఆటగదరా నీకు
నిప్పు బొట్టు

ఆటగదరా నీకు
కంఠాన గరళమ్ము
ఆట గద
పంచేవు అమృతమ్ము.

ఆటగదరా నీకు
అవధూత వేషమ్ము
ఆట గద
అంబతో కళ్యాణము

ఆటగదరా నీకు
అర్థనారీశ్వరా
ఆట గద
దాంపత్య అద్వైతము.

ఆటగదరా నీకు
కన్ను చెదిరే కాంతి
ఆట గద
అంతలో కారుమబ్బు

ఆటగదరా నీకు
గాఢాంధకారమ్ము
ఆట గద
అందులో బుల్లి వెలుగు

ఆటగద మన్మథుని
మసిజేసి పూసేవు
కామినుల
కన్నులను కాటుకలను.

ఆటగద సొగసైన
ఆడచూపులు గుచ్చ
సర్వంబు గోల్పోవు
సర్వజ్ఞుడు.

ఆటగద సంసార
క్షీరసాగర మథన
మాట గద
హాలాహలామృతమ్ము.

ఆటగద దాంపత్య
బంధాలు పేనేవు
ఆట గద
తుంచేవు అంతలోనె.

ఆటగదరా నీకు
ఐశ్వర్య కారకా
ఆట గద
మా నిత్య దారిద్ర్యము.

ఆటగద ఆయుష్షు
నుయ్యాల లూగించి
పండబెట్టేవు
గద పాడెమీద.

ఆటగదరా నీకు
పంచాక్షరీ ప్రభో!
మౌనమే మంత్రమౌ
టాట నీకు.

ఆటగదరా నీకు
శృంగారమున దేల్చి
ముంచేవు
సంసార సాగరమున.

ఆటగద రౌద్రమ్ము
ఆటగద శాంతమ్ము
ఆటగద అద్భుతం
బాట నీకు.

ఆటగద మమ్ములను
తోలుబొమ్మలు చేసి
హాస్యాలు పండించు
టాటనీకు.

ఆటగద అందాని
కజ్ఞాన మిచ్చేవు
జ్ఞాని కొసగేవు
వికృతరూపము

ఆటగదరా విందు
ఆటగదరా పొందు
కడకు గరళమెమందు
ఆట నీకు.

ఆటగదరా శివా
పరనింద జేసేటి
గురివిందలన్నియును
ఆటనీకు.

ఆటగద మనవాడు
ఆటగద పైవాడు
అందరిని కలిపేది
వల్లకాడు.

ఆటగద కరుణతో
కారేటి కన్నీటి
కొసగేవు
పన్నీటి పరిమళంబు

ఆటగద ఆర్త రక్షణ
కొరకు చిందేటి
నెత్తురే అత్తరై
గుబాళించు

ఆటగద సర్వమతముల
సారమొక్కటని
చాటేటి మానవత
ఆట నీకు.

ఆటగద మతము
మారణహోమమైనపుడు
అగ్నిలో ఆజ్యాలు
ఆట నీకు.

ఆటగద సజ్జనుల
తలపులు జలంబులై
లోకాన జనుల
దాహార్తిదీర్చు.

ఆటగద పుణ్యాత్ము
లాత్మలే మబ్బులై
వర్షాలు గురిసి
అన్నార్తి దీర్చు

ఆటగదరా నీకు
మూడు కన్నులవాడ
ఆట గద
మాపైని సీతకన్ను.

ఆటగద కోరికల
కొలిమిలో కాల్చేసి
ఇచ్చేవు వైరాగ్య
వైభోగము.

ఆటగదరా నీకు
రామప్ప కోవెల
ఆటగదరా నీకు
మొండినంది

ఆటగదరా నీకు
అపురూప శిల్పాల
అంగవైకల్యాలు
ఆట నీకు

ఆటగదరా నీకు
బ్రహ్మాండ మండలం
ఆట గద
పుట్టలో చీమగుడ్డు.

ఆటగదరా నీకు
పసిబిడ్డ పుట్టుక
ఆటగదరా నీకు
అమ్మ చావు.

ఆట గద వెండి కొండలపై
నివాసంబు
సాలగ్రామంబు
నీ విలాసంబు.

ఆట గద నమకంబు
ఆట గద చమకంబు
ఆట గద
ఆనందతాండవంబు.

ఆటగదరా శుద్ధ
ఆత్మనైవేద్యంబు
ఆట గద
నెత్తురుల ఆత్మాహుతి.

ఆటగదరా బతుకు
దీపమారిన వెనుక
ప్రమిదలో చమురోసి
ఆట నీకు.

ఆటగదరా నీకు
ఒక్కటే ఒక్కటని
ఒక్కటయ్యే వరకు
ఆట నీకు.

ఆట గద ద్వైతంబు
ఆట అద్వైతంబు
ఒకటి రెండూ
ఒకటె ఆట నీకు.

ఆట గద మూడు మూర్తులు
గలసి ఒక్కటై
దత్తత్రయంబైన
ఆట నీకు.

ఆట గద మాట వరసకె
నాల్గు దిక్కులు
ఒక్కడివె దిక్కువై
ఆట నీకు.

ఆట గద కన్నీటితో
పంచభూతాల
తడిపిజేసిన
ఘటము లాటనీకు

ఆట అరిషడ్వర్గముల
మద్య భళ్ళుమను
ఓటి కుండల శబ్ద
మాట నీకు.

ఆట గద ఏడేడు
జన్మాల పాపాలు
పోగొట్టు అభిషేక
మాట నీకు.

ఆటగదరా నీకు
అష్టసిద్ధుల సమము
విబూది చిటికెడె
ఆట నీకు.

ఆటగదరా నీకు
నవనిధుల తుల్యమగు
మారేడు దళమొకటి
ఆట నీకు

ఆట గద దశదిశల
సత్యసుందరమైన
శివనామమొక్కటే
పిక్కటిల్లు ....

ఆటగదరా నీకు
మొదలు చివరలు లేక
మొలచినా లింగమా
ఆట నీకు

ఆట గద ఉరికేటి
నీటిని జుట్టుతో
మూట గట్టిన వైన
మాట నీకు.

ఆటగదరా నీకు
అర్జునునితో పోరు
ఆట గద ఒసగేవు
పాశుపతము.

ఆటగదరా హరిని
మోహించి మురిసేవు
అయ్యప్ప జన్మంబు
ఆట నీకు.

ఆట గద నిరుపేద
అశ్రుధారల కరిగి
ఆశువుగ ఉప్పొంగె
కనకధార .....

ఆట గద కవికి
లక్షల అక్షరాలిచ్చి
భిక్షమెత్తించేవు
కుక్షి కొరకు

ఆటగదరా శివా
సీతమ్మపై మోజు
ఉసురు దీసెను
రావణాసురునకు.

ఆటగదరా శివా
అన్నదమ్ముల పోరు
అంతమ్ము
కురువంశమింతలోనె.

ఆటగదరా శివా
కృష్ణలీలలు
పెరిగి పెద్దవై
విశ్వరూపమ్మునొందె ....

ఆటగదరా నీవు
నారాయణుండవై
నరుని మార్చేవు గద
గీత చేత

ఆటగదరా నీకు
ఆధార గ్రహమాల
ఆట గద
అరచేత రుద్రాక్షలు.

ఆట గద సద్గుణము
ఆట గద దుర్గుణము
నిర్గుణమె అసలైన
ఆట నీకు.

ఆట గద దైవంబు
ఆట గద దయ్యంబు
రెంటికీ జడిపింతు
వాట నీకు .....

ఆట గద బాల్యమ్ము
ఆట గద యవ్వనము
ఓడిపోయిన క్రీడ
వార్ధక్యము.

ఆటపైవేషమ్ము
లోన కావేషమ్ము
నటరాజ
నీముందె నాటకాలు.

ఆటగద కల్లోల
మానస సరోవరం
ఆటకద
కన్నీట దేలు హంస

ఆట ఢమరుకముతో
ఆరంభమునుజేసి
శంఖమూదేవుగద
అంతమందు.

ఆట గద బతుకంత
కాలకూటముగ్రక్క
శుద్ధిజేతువు గదా
తులసినీళ్ల

ఆటగదరా నీకు
అవతారమెత్తేవు
రాయివై, సాయివై
ఆట నీకు.

ఆట గద భూమిపై
మూడు వంతుల నీరు
మిగతాది కన్నీరు
ఆట నీకు.

ఆట గద నా జన్మ
సార్థక్య మొనరింప
అప్పగించిన రచన
ఆటనీకు.

ఆటగదరా వింత
శివతత్వమును కొంత
నా నోట పలికింతు
వాట నీకు.

ఆట కద నాలోని
ఆత్మలింగేశ్వరా
నిత్య రుధిరాభిషేకమ్ము నీకు.

ఆటగద నాలోని
ఆత్మలింగేశ్వరా
కంఠాన వేతునా
అస్థిమాల

ఆట గద నాలోని
ఆత్మలింగేశ్వరా
ఊపిరులె
అగరుధూపములు నీకు

ఆట గద నాలోని
ఆత్మ లింగేశ్వరా
నేత్రములె
నేతి దీపాలు నీకు.

ఆట గద నాలోని
ఆత్మలింగేశ్వరా
ఆరుచక్రాలె
పుష్పాలు నీకు

ఆట గద నాలోని
ఆత్మలింగేశ్వరా
కుండలిని
యజ్ఞోపవీతమీకు

ఆట గద నాలోని
ఆత్మలింగేశ్వరా
నాశిరమె
నారికేళమ్ము నీకు

ఆట గద నాలోని
ఆత్మ లింగేశ్వరా
బూడిదై నేను
వీబూదిపూతు.

"Cosmic Couplet"

*This universe is a play ground and all animate and inanimate are playthings for **HIM** throughout his play. He has a partner alongwith - **Her, the Shakthi** - as a witness. **By GOD!!***

The author praises His divinity and the playful acts in a very subtle and simple language which renders to the scholastic and also to the illiterate mind. The complex vicissitudes of life, the kindest acts, the vilest deeds and the essence of the Great Vedic Epics are allput in a nutshell in a very simple and sweet form.

*In the last verses, which are quite philosophically eight in number' he accentuates the concept of **"Atmalingeswara"** where the body is His abode and the heart is His seat and he totally submits himself in the humblest manner to theAlmighty.*

He touches our hardened hearts, awakens the Human consciousness in us, makes us Conscientious and sets us on the Transcendental path. It is my utmost belief that these best written-verses read once will not leave any Atheist present, since they explain to him the Concept of God in simplest form.

*God chooses his **"Conduits"** and **Shri Tanikella Bharani** is one of them. This presentation on the **"Cosmic Couplet"** - Lord Siva and Lord kesava - is SOUL STIRRING. His Soul Speaks !!*

*Blessed are those who do **God's Work.***

Dr. Chebiyyam Sreenivasan

ఓం
శివ కవిత
=

మిత్రులు శ్రీ తనికెళ్ళ భరణిగారి 'ఆటగదరా శివా' అన్న శివతత్త్వసారాన్ని చదివే భాగ్యం నాకు కలిగించిన ధన్యుణ్ణి.

శ్రీనాథ సన్నిహిత ధూర్జటి తెనాలి రామలింగాది మహాకవుల జీవత్ భావ భరణిగారి కవితలలో మళ్ళీ ఊపిరి పీల్చుకుంది. శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల వారి 'శివతాండవం' జ్ఞాపకానికి వచ్చింది. అన్నమయ్యగారి అద్వైత స్ఫూర్తి మళ్ళీ విరితేనియలై మాటలలో తొణికిసలాడ ఆవిష్కరించింది.

ఇది శ్రీ భరణిగారు శివునకు ~~అర్పించిన~~ 108 కవితా మారేడుదళాల అష్టోత్తరం.

తేటతెలుగులో శివుణ్ణి [illegible] అని పిలిచారు భరణిగారు.

ఇకపై సహస్రనామార్చన కూడా కవితా రీతిన జరిపి శ్రీ భరణిగారు శివానుగ్రహపాత్రులు కాగలరని ఆశిస్తూ — సెలవు — ఇతి శివమ్.

సిరివెన్నెల సీతారామశాస్త్రి
16.7.99